ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సంగారెడ్డి 3 మెదక్
సోమవారం 27 జనవరి 2025
జిల్లాల వార్తలు



మెదక్‌లో జెండా ఎగురవేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి
- నిరుపేదలకు ప్రభుత్వ పథకాలతో భరోసా
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- ఘనంగా గణతంత్ర దినోత్సవం

అన్నివర్గాల తోడ్పాటుతో

జిల్లా పురోభివృద్ధి



మెదక్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, ప్రజలు, అధికారుల సహకారంతో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో జిల్లాను రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా నిలిపేందుకు కృషి చేస్తామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని పోలీస్ పేరేడ్‌గ్రౌండ్స్‌లో 76వ గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, అదనపు కలెక్టర్ నాగేష్, అదనపు ఎస్పీ మహేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ జాతీయ జెండాను ఎగురవేసి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను పణంగా పెట్టినవారి త్యాగాలను ప్రజలు ఎన్నటికీ మరువబోరని పేర్కొన్నారు. త్యాగధనుల కృషితో సిద్ధించి స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందాలని ఆకాంక్షించారు. సమన్వయంతో పనిచేసి జిల్లాను ప్రగతిపథంలో నడిపిస్తామన్నారు. నిరుపేదలకు సంక్షేమ పథకాలను అందించడంలో జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా కృషి చేస్తోందని కొనియాడారు. అనంతరం జిల్లా ప్రగతిపై వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

పథకాల అమలు ఇలా..

మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 1.83 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని, దీంతో రూ.62.44 కోట్ల లబ్ది చేకూరిందని పేర్కొన్నారు. గృహజ్యోతి కింద 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించుకున్న 1,26,536 మందికి కరెంటు బిల్లులో రూ.41.54 కోట్ల రాయితీ అందజేసినట్లు తెలిపారు. 1,25,998 మంది వినియోగదారులకు 3,88,411 గ్యాస్ సిలిండర్లను రూ. 500కు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఇందుకోసం రూ.10.96 కోట్ల సబ్సిడీ అందించామని వివరించారు. రైతు భరోసా పథకంలో 2023-24 సంవత్సరానికి 2,63,933 మంది రైతుల ఖాతాల్లో రూ. 194.54 కోట్ల సాయం జమ చేశామన్నారు. నేటి నుంచి రైతు భరోసా కింద ఎకరాకు రూ.12వేల చొప్పున అందజేస్తామని చెప్పారు. రుణమాఫీలో భాగంగా 82,294 మంది రైతులకు రూ.604.21 కోట్ల రుణాలను మాఫీ చేశామని చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద జిల్లాలో 14,989 మంది పేదలు చికిత్సలు పొందారని చెప్పారు.

జిల్లాలో దొడ్డు రకం ధాన్యం 2,37,603 మెట్రిక్ టన్నులు, సన్న రకాలు 53,659 మెట్రిక్ టన్నులు సేకరించామన్నారు. సన్న వడ్లకు 12,872 మందికి రూ. 26.83 కోట్లు బోనస్ జమ చేశామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం జిల్లాలో 1,91,100 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం హామీ ఇచ్చినమేరకు జిల్లాలో ప్రతీ మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి నేటి నుంచి నాలుగు సంక్షేమ పథకాలను ప్రారంభించామని తెలిపారు. క్రమంగా అన్ని గ్రామాలకు విస్తరిస్తామని వివరించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మెదక్ అర్బన్ : గణతంత్ర వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు చూపరులను కట్టిపడేశాయి. వివిధ పథకాలపై నిర్వహించిన శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లా పంచాయతీ శాఖ, గ్రామీణాభివృద్ధిశాఖ, రవాణా శాఖ, అటవీ శాఖ, వ్యవసాయశాఖ, అగ్నిమాపక, ఆర్టీసీ, విద్యుత్ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు శకటాలను ప్రదర్శించారు. అంతకుముందు స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్పీ మహేందర్, మున్సిపల్‌చైర్మన్ చంద్రపాల్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.



మెదక్‌లో...

గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న నిర్మలాజగ్గారెడ్డి



పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన స్టాల్‌లో అదనపు కలెక్టర్లతో కలిసి తుపాకీని పరిశీలిస్తున్న నిర్మలా జగ్గారెడ్డి



అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురిలకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్‌తో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పాల్గొన్నారు. కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎస్పీ రూపేష్‌తో కలిసి ఉత్తమ ఉద్యోగులు, క్రీడాకారులు, విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్న చిన్నారులను అభినందించారు. ఆమె వెంట సీడీసీ చైర్మన్ రాంరెడ్డి ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక
- నిరంతరం దరఖాస్తుల స్వీకరణ



గణతంత్ర వేడుకల్లో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డిలో జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేశ్, అదనపు కలెక్టర్లు

- రైతులకు రూ.846.83 కోట్ల రుణమాఫీ
- 2.20 కోట్ల మహిళలకు ఉచిత ప్రయాణం
- మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం
- సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 26: జిల్లాలోని అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని, పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక జరుగుతున్నదని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు స్పష్టం చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన వేడుకల్లో ఆమె త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం జిల్లా అభివృద్ధి, సంక్షేమంపై సందేశమిచ్చారు. మహాలక్ష్మీతో పాటు ఇతర పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ఇదే స్ఫూర్తితో ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అర్హులకు చేరవేస్తామని వివరించారు. గ్రామసభల ద్వారా అర్హుల జాబితాలను బహిరంగం చేయడంతోపాటు కొత్త దరఖాస్తులు స్వీకరించామని, ప్రజల అభిప్రాయాలను సేకరించినట్లు తెలిపారు.

దశలవారీగా అందరికీ..

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద వ్యవసాయ కూలీలకు, రైతు భరోసా ద్వారా రైతులకు ప్రభుత్వం సాయం అందజేస్తుందని తెలిపారు. కొత్తరేషన్ కార్డులను ప్రజాపాలన దరఖాస్తులతో పాటు మీసేవలో దరఖాస్తు చేస్తున్నవారికి కూడా ఇస్తామని పేర్కొన్నారు. ఇళ్లు లేని పేదవారికి ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఇందుకోసం వితంతువులు, దివ్యాంగులు, పారిశుధ్య కార్మికులు, నిరుపేదలు, ట్రాన్స్ జెండర్లను తొలి ప్రాధాన్యంగా పరిగణలోకి తీసుకుంటామని వివరించారు. ఈ పథకాలకు నిరంతరం దరఖాస్తులు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు.

సందేశంలోని ప్రధానాంశాలు

- 2023 డిసెంబరు నుంచి 2.20 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేశారు. రూ.99.66 కోట్లు మహిళలకు ఆదా అయ్యాయి.
- సంగారెడ్డి జిల్లాలో 1.61 లక్షల మంది వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ సబ్సిడీగా ఇప్పటివరకు రూ.13.84 కోట్లను అందించారు.
- గృహజ్యోతి ద్వారా 2.15 లక్షల గృహాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ కోసం రూ.64.59 కోట్లు చార్జీలను ప్రభుత్వమే డిస్కంలకు చెల్లించడం జరిగింది.
- 98,056 మంది రైతులకు రూ.846.83 కోట్ల రుణమాఫీ జరిగింది. మిగితావి త్వరలో పూర్తిచేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.
- జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో రూ. కోటి 99లక్షల వ్యయంతో పెట్రోల్ బంకు ఏర్పాటు చేశారు. మహిళా శక్తి క్యాంటిన్లు, మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్లు ప్రారంభించారు.
- గడిచిన ఏడాది కాలంలో 20,193 మందికి రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు జరిగాయి.
- జిల్లాలో డీఎస్సీ ద్వారా 415 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారు. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ప్రతీరోజు సాయంత్రం అల్పాహారం సమకూర్చడానికి రూ.52 లక్షలు మంజూరు చేశారు.
- అందోల్, పుల్కల్, చౌటుకూర్, మునిపల్లి, సదాశివపేట మండలాలకు సంబంధించి సింగూరు ప్రాజెక్టు కాలువల సీసీ లైనింగ్ కోసం రూ.168.30 కోట్లు విడుదల చేస్తూ పరిపాలన అనుమతులు మంజూరయ్యాయి.
- జిల్లాలో శాంతిభద్రతలను నెలకొల్పడంతోపాటు గంజాయి సాగు, అక్రమ రవాణా, మాదకద్రవ్యాల దుర్వినియోగంపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారని కలెక్టర్ క్రాంతి తన సందేశంలో ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ఎస్పీ రూపేష్, అడిషనల్ కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో పద్మజారాణి, అడిషనల్ ఎస్పీ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయా శాఖలకు సంబంధించిన శకటాలు ఆకట్టుకున్నాయి. పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆయుధాల ప్రదర్శన, వివిధ శాఖలకు సంబంధించిన స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలె అలరించాయి.



ఏఈఓ ఎగురవేసిన చిరిగిన జాతీయ జెండా

జాతీయ జెండాకు అవమానం

వెల్దుర్తి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : వెల్దుర్తి వ్యవసాయశాఖ అధికారులు నిర్లక్ష్యం కారణంగా జాతీయ జెండాకు అవమానం జరిగింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద ఏవో ఝాన్సీ జాతీయ జెండాను ఆవిష్కరించాల్సి ఉన్నా ఆమె రాకపోవడంతో ఏఈవో మజీద్ ఎగురవేశారు. ఈక్రమంలో జెండా కుట్టు ఊడిపోయినా చూసుకోకుండా ఆవిష్కరించారు. జెండావిష్కరణ పూర్తయిన తర్వాత ఏవో ఝాన్సీ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి.. వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్లకుండానే తిరిగి వెళ్లిపోయారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం పూర్తయిన తర్వాత డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరి కార్యాలయానికి రావడం గమనార్హం.



సంగారెడ్డిలో..

అదనపు కలెక్టర్ల చేతికి మున్సిపాలిటీల పాలన

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 26: మున్సిపాలిటీ పాలకవర్గాల గడువు పూర్తి కావడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. మళ్లీ ఎన్నికలు జరిగి నూతన పాలకవర్గాలు ప్రమాణస్వీకారం చేసేవరకు వీరు కొనసాగుతారు. మున్సిపాలిటీల నిర్వహణ, పర్యవేక్షణలో ప్రత్యేకాధికారులే కీలకం కాబోతున్నారు. కాగా స్థానిక సంస్థలను పర్యవేక్షిస్తున్న అడిషనల్ కలెక్టర్లకే ఇంచార్జులుగా అవకాశం కల్పించారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న సంగారెడ్డి జిల్లాలోని మున్సిపాలిటీల బాధ్యతలను మాత్రం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్‌కు అప్పగించారు.

ప్రత్యేకాధికారులు వీరే..

మెదక్ జిల్లా: మెదక్, నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్ మున్సిపాలిటీలు - మెంచు నగేష్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)

సంగారెడ్డి జిల్లా: అమీన్‌పూర్, తెల్లాపూర్, ఐడీఏ బొల్లారం మున్సిపాలిటీలు - ఫాల్గున్ కుమార్, జాయింట్ డైరెక్టర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్. ● సంగారెడ్డి, సదాశివపేట, నారాయణఖేడ్, అందోల్-జోగిపేట మున్సిపాలిటీలు- చంద్రశేఖర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)

మల్లన్నకు లష్కర్ బోనం

చేర్యాల, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న క్షేత్రం లష్కర్ భక్తులతో పోటెత్తింది. బ్రహ్మోత్సవ మహాజాతరలో భాగంగా సంక్రాంతి తరువాత వచ్చిన రెండో వారమైన ఆదివారం రోజున సికింద్రాబాద్‌కు చెందిన భక్తులు స్వామివారి దర్శనార్థం తరలివచ్చారు. కోనేటిలో పుణ్యస్నానమాచరించి, మల్లన్నకు బోనం నివేదించారు. పట్నాలు సమర్పించి, తమ కోరికలు నెరవేర్చమని ఆలయ ప్రాంగణంలోని గంగరేగుచెట్టుకు ముడుపులు కట్టారు. ఒడిబియ్యాలు పోసి కాపాడమని వేడుకున్నారు. ఎల్లమ్మకు బోనం చేసి డప్పుచప్పుళ్ల హోరుతో గుట్టపైకి ఎక్కి సమర్పించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. పట్నాలు వేసిన భక్తులతో గంగరేగుచెట్టు ప్రాంగణం కిటకిటలాడింది.



రాజగోపుర ఆవరణలో భక్తుల రద్దీ



నేరడిగుంటలో పథకాల మంజూరు పత్రాలను అందజేస్తున్న మంత్రి దామోదర్, కలెక్టర్ క్రాంతి

సింగూరు కాల్వల సీసీ లైనింగ్‌కు రూ.168 కోట్లు

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- పేదలందరికీ పథకాలు అందజేస్తాం : సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి
- ఇసోజిపేట,నేరడిగుంటలో నాలుగు సంక్షేమ పథకాల ప్రారంభం

7

బీజేపీ ప్రజలపై మతాన్ని రుద్దుతోంది



- ప్రజల సమస్యలు పట్టని పాలకులు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

7

అనువైన స్థలంలోకి కూరగాయల మార్కెట్

మెదక్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట పట్టణంలో కూరగాయల మార్కెట్‌కు అడ్డంకులు తొలిగాయి. దశాబ్దాలుగా దుమ్ము రోడ్లపైనే అమ్మకాలు సాగాయి. ఈ నేపథ్యంలో చర్చి ఆవరణలోకి మార్చగా.. ఎన్నో ఆటంకాలు ఏర్పడ్డాయి. మార్కెట్ స్థలం కోసం ఆందోళనకు సిద్ధమవుతున్న తరుణాన.. అనువైన స్థలం దొరకడంతో ఆదివారం అక్కడికి మార్చారు. ఇదే అదునుగా రామాయంపేటకు వచ్చిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌ను ఆహ్వానించి రిబ్బన కట్ చేయించారు. దీంతో విక్రయదారుల సమస్య పూర్తిగా తొలిగినట్లైంది. ఇదిలా ఉంటే ఈ స్థలం బీఆర్ఎస్ హయాంలో మున్సిపల్ భవన నిర్మాణానికి కేటాయించారు. ఇందుకు సంబంధించి పనులు సాగనందున.. ఖాళీగా ఉన్న స్థలాన్ని ఆక్రమించి వ్యాపారులు డేరాలు వేసుకున్నారు. మున్సిపల్ అధికారులు మార్కెట్‌కు స్థలం కేటాయించడంలో పూర్తిగా వైఫల్యం చెందింది. దీంతో తప్పని స్థితిలో విక్రయదారులే ఈ స్థలాన్ని ఎంపిక చేసుకోవడం గమనార్హం. అంతేకాదు అత్యంత విలువైన స్థలంలోకి మార్చినా అధికారులు అడ్డు చెప్పలేకపోయారు.



మెదక్ రహదారి అనుకొని ఏర్పాటైన కూరగాయల మార్కెట్

విరబూసిన బ్రహ్మ కమలాలు



ఖేడ్‌లోని పండరినాయక్, పల్లవి గృహంలో విరగబూసిన బ్రహ్మకమలం

నారాయణఖేడ్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ పట్టణంలోని సాయిబాబా కాలనీకి చెందిన పండరినాయక్, పల్లవి గృహంలో ఆదివారం తెల్లవారు జామున బ్రహ్మ కమలాలు విరగబూశాయి. మొదటిసారిగా బ్రహ్మకమలాలు విరగబూయడంతో వారు పూజలు చేశారు. ఈ పువ్వులను చూడటానికి కాలనీవాసులు పెద్దఎత్తున తరలివస్తున్నారు.



దర్శనం కోసం బారులు తీరిన భక్తులు





కిక్కిరిసిన గంగిరేగుచెట్టు ప్రాంగణం, పట్నంవేసి మొక్కు తీర్చుకుంటున్న భక్తులు

దండాలు మల్లన్న

కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో వారమైన ఆదివారం ఆలయానికి భక్తులు పోటెత్తారు. లష్కర్‌వారం కావడంతో సికింద్రాబాద్‌కు చెందిన భక్తులు స్వామివారి దర్శనార్థం భారీగా తరలివచ్చారు. ఇలవేల్పయినా మల్లన్న స్వామిని దర్శించుకున్నారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల సిగాలతో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



బోనాలు తీసుకువెళుతున్న భక్తులు

క్రైం కార్నర్

చెరువులో శవమై తేలిన గురుకుల విద్యార్థి



మహేందర్‌రెడ్డి (ఫైల్)

సదాశివపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణ పరిధిలోని కొత్త చెరువులో ఆదివారం గురుకుల విద్యార్థి మృతదేహం లభ్యమైంది. సీఐ మహేష్‌కుమార్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం కొండాపూర్ మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన గంగారపు రామకృష్ణారెడ్డి, ప్రవీణ దంపతుల కుమారుడు మహేందర్‌రెడ్డి(18) మునిపల్లి మండలం లింగపల్లి గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు ఇంటికొచ్చిన అతను ఈనెల 20న ఇంటి నుంచి పాఠశాలకు బయలుదేరి.. తిరిగి అదేరోజు సదాశివపేటకు వచ్చాడు. మూడురోజులుగా కళాశాలకు రాకపోవడంతో ఈ నెల 23న కళాశాల సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు బంధువుల, మిత్రుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మహేందర్‌రెడ్డి కోసం గాలింపు చేపట్టారు. తాజాగా సదాశివపేట సమీపంలోని కొత్త చెరువులో మహేందర్‌రెడ్డి ఆదివారం సాయంత్రం శవమై కనిపించాడు. విద్యార్థి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు. మహేందర్‌రెడ్డి మృతితో అనంతసాగర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పురుగుల మందు తాగిన వ్యక్తి..

చికిత్స పొందుతూ మృతి



కనకరాజు (ఫైల్)

కుకునూరుపల్లి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన కోనాయపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని వడ్డెర కాలనీకి చెందిన దున్నపోతుల కనకరాజు(28)కు నాలుగేళ్ల క్రితం వెల్దండ గ్రామానికి చెందిన మమతతో వివాహమైంది. దంపతులిద్దరు హైదరాబాద్‌లో కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కనకరాజు తల్లి అనారోగ్యానికి గురికావడంతో పది రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చి ఇక్కడే ఉంటున్నారు. తల్లి ఆరోగ్యం దృష్ట్యా ఇక్కడే ఉందామని కనకరాజు భార్యతో చెప్పగా ఆమె ఒప్పుకోలేదు. ఈ విషయంపై భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గురువారం కూడా గొడవ పెట్టుకుని మమత హైదరాబాద్‌కి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన కనకరాజు పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



శ్రీకాంత్ (ఫైల్)

శివ్వంపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం పెద్ద గొట్టిముక్కలలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని పెద్దగొట్టిముక్కల గ్రామానికి చెందిన కొత్తోళ్ల శ్రీకాంత్(29) ఫ్లిప్‌కార్ట్‌లో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతునికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ర్యాపిడో రైడర్ మృతి

రామచంద్రాపురం టౌన్, జనవరి 26, (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ర్యాపిడో రైడర్ దుర్మరణం చెందిన ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ రవీందర్ కథనం ప్రకారం... హఫీజ్‌పేటకు చెందిన జగన్నాథ్(35) ర్యాపిడో రైడర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం రోజుమాదిరిగానే విధులకు వెళ్లాడు. గచ్చిబౌలి నుంచి విపిన్‌కుమార్ అనే కస్టమర్‌ను తెల్లాపూర్‌కు ఎక్కించుకుని వచ్చాడు. తెల్లాపూర్ హుడా వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ బైక్‌ను ఢీ కొట్టడంతో రైడర్ జగన్నాథ్ అక్కడికక్కడే మృతి చెందగా, విపిన్‌కుమార్ గాయాలతో బయటపడ్డాడు. మృతుడి భార్య సురేఖ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సురేశ్ కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు

రామచంద్రాపురం టౌన్, జనవరి 26, (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదైంది. ఎస్‌ఐ దేవేందర్ కథనం ప్రకారం ఉస్మాన్‌నగర్‌కు చెందిన యాదయ్య(50) రాజపుష్ప విల్లాస్‌లో నీళ్లు విడిచే పనులు నిర్వర్తిస్తున్నాడు. ఈ నెల 18న వెళ్తున్న యాదయ్యను బైక్‌పై వెళ్తున్న ముఖేష్ అనే వ్యక్తి వెనుక నుంచి బలంగా ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స ఖర్చు భరిస్తానని చెప్పిన ముఖేష్ ఎంతకీ చెల్లించకపోవడంతో యాదయ్య ఆదివారం కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

సింగూరు కాల్వల సీసీ లైనింగ్‌కు రూ.168 కోట్లు

- పది రోజుల్లో పనులు ప్రారంభిస్తాం
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- పేదలందరికీ పథకాలు అందజేస్తాం : సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి
- ఇసోజిపేట,నేరడిగుంటలో నాలుగు సంక్షేమ పథకాల ప్రారంభం

జోగిపేట/పుల్కల్, జనవరి26 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టు నుంచి సాగునీరందించే కాల్వలకు రూ.168 కోట్ల వ్యయంతో సిమెంట్ లైనింగ్ చేయనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. పది రోజుల్లో ఆ పనులను ప్రారంభిస్తామని చెప్పారు. ఆదివారం పుల్కల్ మండలం ఇసోజిపేట, అందోలు మండలం నేరడిగుంట గ్రామాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను కలెక్టర్ క్రాంతి వల్లూరితో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. పలువురు లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జోగిపేటలోని నర్సింగ్ కాలేజీకి అనుబంధంగా 100 పడకల ఆస్పత్రి నిర్మిస్తున్నామని చెప్పారు. 50 పడకలతో అధునాతన మాతాశిశు సంరక్షణ ఆస్పత్రిని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సుల్తాన్‌పూర్ వద్ద పోలీస్ స్టేషన్, ట్రామా కేర్ ఆస్పత్రిని త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఆయా కార్యక్రమల్లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్‌డీవో జ్యోతి, అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు, డీపీవో సాయిబాబా, హౌజింగ్ పీడీ చలపతి రావు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మక్త జగన్మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దుర్గారెడ్డి, శివరాజ్ యాదవ్, నాయకులు రాజిరెడ్డి, రామచంద్రారెడ్డి, గాల్ రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇసోజిపేటలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

● వట్‌పల్లి : వట్‌పల్లిలో రూ.11.20 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదివారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలని, వచ్చే ఏడాదిలోగా అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు.



సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

బీజేపీ ప్రజలపై మతాన్ని రుద్దుతోంది

- ప్రజల సమస్యలు పట్టని పాలకులు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

సంగారెడ్డి రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం కలిగిన బీజేపీ ప్రజలపై మతాన్ని రుద్దుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సీపీఎం రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా రెండవ రోజు ఆదివారం కొండాపూర్ మండలం మల్కాపూర్ చింతల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జాతీయ జెండాతో పాటు పార్టీ జెండాను ఆవిష్కరించి అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదన్నారు. ముఖ్యంగా ప్రజాసమస్యలను పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఈ మహాసభల ద్వారా తెలంగాణలో ప్రజల మన్ననలు పొందేలా నిర్ణయాలు ఉంటాయన్నారు. ప్రజా సమస్యలపై ఉద్యమించేందుకు భవిష్యత్ కార్యాచరణ రూపొందించి తీర్మానిస్తామన్నారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మహాసభల ఆహ్వాన కమిటీ చైర్మన్ చుక్క రాములు మాట్లాడుతూ సీపీఎం రాష్ట్ర మహాసభలను సంగారెడ్డిలో నిర్వహిస్తుండడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, జాన్‌వెస్లీ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి జయరాజ్, మాణిక్యం, సాయిలు, కృష్ణ, దత్తు తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు కాంగ్రెస్‌లో అసమ్మతిని చల్లారుస్తాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- దాడి ఘటనపై పీసీసీ నిజనిర్ధారణ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

పటాన్‌చెరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు కాంగ్రెస్‌లో అసమ్మతిని చల్లార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ అన్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడి విషయమై నిజనిజాలు తేల్చేందుకు అధిష్టానం ఆయనతోపాటు పీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డితో కూడిన నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఆదివారం పటాన్‌చెరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులతో వారు సమావేశమై అభిప్రాయాలను సేకరించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్‌తో ప్రత్యేకంగా సమావేశమై నియోజకవర్గంలో అసమ్మతికి కారణాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విప్ ఆదిశ్రీనివాస్ మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని ఏకతాటిపైకి తెచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇటీవల చోటుచేసుకున్న పరిస్థితులపై పూర్తి స్థాయిలో అభిప్రాయాలను సేకరించి పార్టీ పీసీసీ అధ్యక్షుడు, సీఎంకు నివేదిక రూపంలో అందజేస్తామన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు, టీఎస్ఐఐసీ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి, మెదక్ పార్లమెంట్ నాయకుడు నీలం మధుముదిరాజ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుధాశ్రీనివాస్‌గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

తండ్రీకొడుకులకు రిమాండ్

చిన్నశంకరంపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని కామారం తండాకు చెందిన తండ్రీకొడుకులను రిమాండ్‌కు తరలించారు. ఆదివారం ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన కథనం ప్రకారం తండాకు చెందిన హలావత్ భీమా గతంలో వ్యవసాయ భూమిని మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపల్లికి చెందిన ఆకుల శ్రీనివాస్‌కు విక్రయించాడు. దీంతో శ్రీనివాస్ అందులో పంటలను సాగు చేస్తున్నాడు. కాగా, గతేడాది ఫిబ్రవరిలో హలావత్ భీమా, తన కుమారుడు రాజ్‌కుమార్ అకారణంగా అతడి పంటను ధ్వంసం చేయగా, బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో తండ్రీకొడుకులపై క్రిమినల్ కేసు నమోదు చేసి బైండోవర్ చేసి హెచ్చరించారు. అయినా పలుమార్లు శ్రీనివాస్‌తో గొడవపడ్డారు. దీంతో సత్ప్రవర్తన ఉల్లఘించినందుకు గాను తహసీల్దార్ ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున జరిమానా, జైలు శిక్ష విధించారు. జరిమానా కట్టనందున తహసీల్దార్ ఆదేశాల మేరకు తండ్రీకొడుకులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.





శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, స్వామివారి ఎదుర్కోలులో విద్యార్థినుల కోలాటం

ఘనంగా శివపార్వతుల కల్యాణం

కొండపాక, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దుద్దెడ గ్రామంలోని స్వయంభూ శంభు లింగేశ్వర ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలు మూడవ రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గొల్లపల్లి రఘురామశర్మ, శ్రీనివాస్‌శర్మ నేతృత్వంలో వేద బ్రాహ్మణులు శివపార్వతుల కల్యాణాన్ని క్రతువును వైభవంగా నిర్వహించారు. స్వామివారి తరఫున గ్రామానికి చెందిన నర్ర సవిత-రాఘవరెడ్డి కుమార్తె బండి కీర్తి - మాధవ రెడ్డిలు వ్యవహరించగా అమ్మవారి తరఫున సికింద్రాబాద్‌కు చెందిన నీలిమ- మహేశ్ దంపతులు కన్యాదానం చేశారు. భక్తులు అధికసంఖ్యలో హాజరైన కల్యాణాన్ని వీక్షించారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, జిల్లా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వేలేటి రోజా-రాధా కిషన్ శర్మ వేడుకలకు హాజరయ్యారు. కల్యాణం అనంతరం రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్‌కు చెందిన దాతలు ఉప్పల రాధ, పద్మ, శ్రీనివాస్, ఆలయ ట్రస్టు అధ్యక్షులు మంచాల శ్రీనివాస్, సభ్యులు తాజా మాజీ సర్పంచ్ ఆరేపల్లి మహాదేవ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సాయంత్రం ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు వంటేరు ప్రతాపరెడ్డి తదితరులు ఉన్నారు.



మెదక్ జిల్లాలో ప్రశంసాపత్రాలను అందుకుంటున్న ఉత్తమ ప్రభుత్వ ఉద్యోగులు

ఉత్తమ సేవలకు ప్రశంసలు

విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన వివిధ శాఖల ఉద్యోగులకు 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం ప్రశంసా పత్రాలు అందజేశారు. మెదక్ జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఈ వేడుకల్లో కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, అదనపు కలెక్టర్ నగేష్ చేతుల మీదుగా ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే సంగారెడ్డి జిల్లాలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ వల్లూరు క్రాంతి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు.

- మెదక్ అర్బన్/సంగారెడ్డి టౌన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి)



సంగారెడ్డి జిల్లాలో ప్రశంసాపత్రాలను అందుకుంటున్న ఉత్తమ ఉద్యోగులు

న్యూస్ బాక్స్

31 నుంచి వైకుంఠపురం ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

సంగారెడ్డి అర్బన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి శివారులోని శ్రీవైకుంఠపురం ఆలయ 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు 31వ తేదీ నుంచి ఫిబ్రవరి 5వ తేదీవరకు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కందాడై వరదాచార్యులు తెలిపారు. ఆలయ ఆవరణలో బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు

సంగారెడ్డి అర్బన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బీసీ గురుకులాల ప్రిన్సిపాల్స్ ధన్‌రాజ్, రజినీలు వేర్వేరు ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికిగాను ఫిబ్రవరి 1వ తేదీలోగా తమ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కులం, ఆదాయం, ఆధార్, బర్త్ సర్టిఫికేట్, ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని వారు కోరారు.

గురుకులాలపై అవగాహన ర్యాలీ

హత్నూర, జనవరి 26 (ఆంధజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో విద్యార్థుల చేరికపై మండల కేంద్రమైన హత్నూరలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, పాఠశాల ఉపాధ్యాయులు ఆదివారం ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మధుసూదన్ మాట్లాడుతూ గురుకులాల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు మెరుగైన వసతులు కల్పిస్తున్నామన్నారు.

సీఎస్ఐ చర్చిలో భక్తుల సందడి

మెదక్ కల్చరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో ప్రెసిబేటరీ ఇన్‌చార్జి బిషప్ శాంతయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనలకు తెలంగాణ వ్యాప్తంగా ఉన్న జిల్లాల, పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. చర్చి ఆవరణ మొత్తం ఏసు నామ స్మరణతో మారుమోగింది.

ధ్యానంతో ఒత్తిడి దూరం

నర్సాపూర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ధ్యానం వల్ల మానసిక ఒత్తిడి దూరమవ్వడమే కాకుండా ఆరోగ్యపరంగా ఉపయోగకరంగా ఉంటుందని హార్ట్‌ఫుల్‌నెస్, రామంచంద్రమిషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. నర్సాపూర్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో హార్ట్‌ఫుల్‌నెస్, రామచంద్రమిషన్ సంయుక్తంగా మూడురోజుల పాటు ఉచిత ధ్యాన శిక్షణ నిర్వహిస్తున్నారు. ఆదివారం రెండో రోజు నిర్వహించిన శిక్షణ సందర్భంగా ప్రతినిధులు శ్రీనివాస్, అశోక్ మాట్లాడారు.

కుంటను పూడుస్తున్న వ్యక్తులపై కేసు

రామచంద్రాపురం టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా గోపన్‌పల్లి నుంచి ప్రవహిస్తున్న కాలువ వనం చెరువులోకి చేరకుండా కొందరు వ్యక్తులు కుంటను పూడ్చే పనులు చేపట్టారు. విషయాన్ని తెలుసుకున్న ఇరిగేషన్ ఏఈ సంతోషిని జేసీబీతో కాలువను పూడుస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదివారం కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రవీందర్ ఆదేశాల మేరకు ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేశారు.



జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఆర్డీవో రాంరెడ్డి, నాయకులు



పటాన్‌చెరు మైత్రీ మైదానం పరేడ్ గ్రౌండ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

వాడవాడలా మువ్వన్నెల రెపరెపలు

76వ గణతంత్ర వేడుకలను సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ప్రభుత్వ, పార్టీ, గ్రామపంచాయతీ కార్యాలయాలు, పాఠశాలల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, ఎంపీడీవోలు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ సర్పంచులు, ఉపాధ్యాయులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. మహనీయుల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.

- న్యూస్ నెట్‌వర్క్



ఇందిరమ్మ వేషధారణలో చిన్నారి



కల్హేర్ శ్రీసాయి విద్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో విద్యార్థులు



మెదక్ అర్బన్: సిద్దార్థ్ విద్యాసంస్థల్లో ఘనంగా 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న అదనపు కలెక్టర్ మెంచు నగేష్

'ఖేడ్'ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే నిధులతో నారాయణఖేడ్ మున్సిపాలిటీని మోడల్‌గా తీర్చిదిద్దుతామని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం పూర్తి కావడంతో ఆదివారం మున్సిపాలిటీ మీటింగ్‌హాల్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. పట్టణంలోని అన్ని వార్డులతో పాటు కాలనీల్లో సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం, వీధిదీపాలను ఏర్పాటు చేయడమే కాకుండా ప్రధాన రహదారుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడానికి అమృత 2.0 పథకం ద్వారా రూ.13.50 కోట్లతో సంపులు, ట్యాంకుల నిర్మాణం పనులు చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్‌లతో పాటు కౌన్సిలర్లను మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, కోఆప్షన్ సభ్యులను ఘనంగా సన్మానించారు.



చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లను సన్మానిస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పటాన్‌చెరులో ల్యాండ్ మాఫియా విధ్వంసం

- ప్రైవేటు భూమి విషయంలో తలెత్తిన వివాదం
- వాచ్‌మెన్ కుటుంబంపై దాడి
- గేట్లు విరగ్గొట్టి, గడ్డివాము దగ్ధం

పటాన్‌చెరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు పట్టణ శివారులో ఓ విలువైన ప్రైవేటు భూమి విషయంలో ఆదివారం తలెత్తిన వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పటాన్‌చెరుకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు అనంతయ్యకు ప్రభుత్వం గతంలో భూమిని అసైన్డ్ చేసింది. ఆయన వారసుల్లో కొందరు భూమిని వీరేశం అనే వ్యక్తికి విక్రయించారు. అనంతయ్య కుమారుల్లో అశోక్ అనే వ్యక్తి భూమిని అమ్మలేదు. కాగా తాను కొనుగోలు చేసిన భూమి అశోక్ సర్వేనెంబర్లలో వస్తుందని వీరేశం స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు కొంతకాలంగా ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో కొంతమందితో కలిసి స్థలం చుట్టూ వేసిన ఫెన్సింగ్, గేట్‌ను తొలగించి లోపలికి ప్రవేశించి విధ్వంసం సృష్టించారు. ఆవుల కోసం తెచ్చిన గడ్డిని తగులబెట్టారు. అక్కడ కాపలాగా ఉన్న వాచ్‌మెన్ కుటుంబంపై దౌర్జన్యం చేశారు. పెద్ద సంఖ్యలో ప్రైవేటు వ్యక్తులు వివాదాస్పద స్థలంలో విధ్వంసం సృష్టించడం సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైంది. కాగా బాధితుడు అశోక్ పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ దాడిలో ఓ నాయకుడి పాత్ర ఉందని ప్రచారం జరిగింది. కోట్లాది రూపాయల విలువైన 30 గుంటల భూమిని హస్తగతం చేసుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకుని తాను స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసుకుని డైరీ ఫారం పెట్టుకుంటే ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితుడు వాపోయాడు.



ప్రైవేటు భూమిలోకి ప్రవేశించిన దుండగులు

పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

రామచంద్రాపురం టౌన్, జనవరి 26, (ఆంధ్రజ్యోతి) : పిల్లల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్(తెనా) ఆధ్వర్యంలో చిన్నారులకు నిర్వహించిన ఆటలపోటీల్లో ప్రతిభను కనబర్చిన వారికి ఎంపీ జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చిన్నారులకు ప్రోత్సహిస్తే వారు ఉన్నత శిఖిరాలను అధిరోహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తెన అధ్యక్షులు రమణ, కార్యనిర్వాహక సభ్యులు రవిరమణ పాల్గొన్నారు.

పదేళ్లు పట్టించుకోలేదు.. ఏడాదిలోనే పనులకు శ్రీకారం

మెదక్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల ఏలిన పాలకులు అభివృద్ధిని ఎంత మాత్రం పట్టించుకోలే..! కానీ ఏడాదిలో ఎన్నో అభివృద్ధి పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. ఆదివారం రామాయంపేటలో వెజ్ మార్కెట్ ప్రారంభించి వ్యాపారుల సమస్యలు విన్నారు. అనంతరం పట్టణంలోని చిత్తారమ్మ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. చివరగా మండల పరిధి దామర చెరువులో నాలుగు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం మాట్లాడుతూ తాను అభివృద్ధి కనిపించేలా ముందడుగు వేస్తానన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా చెప్పుడు మాటలతో పాలన చేయనన్నారు. ఇప్పటికే రామాయంపేటలో రూ.120 కోట్లతో అతిపెద్ద గురుకులాన్ని నిర్మించబోతున్నట్లు స్పష్టం చేశారు. ఆయన వెంట సుప్రభాతరావు, రమేష్‌రెడ్డి, డాకి స్వామి, అల్లాడి వెంకటి, విప్లవ్, వినయ్ ఉన్నారు.

పదవి శాశ్వతం కాదు.. ప్రజల్లో ఉండాలి

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 26(ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల పాటు ప్రజలకు సేవలందించిన మెదక్-నర్సాపూర్- రామాయంపేట మున్సిపాలిటీ కౌన్సిల్ పాలకవర్గాలను జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి సన్మానించారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మూడు మున్సిపాలిటీల పాలకవర్గాలతో కలిసి సమావేశమై మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధిని, చేపట్టిన సంక్షేమ పథకాలు, మున్సిపాలిటీల అభివృద్ధికి కేటాయించిన పట్టణ ప్రగతి తదితర విషయాలను గుర్తు చేసుకున్నారు. పదవి శాశ్వతం కాదని.. ప్రతి ఒక్కరు ప్రజల్లో ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్, నర్సాపూర్, రామాయంపేట పాలకవర్గాల కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

'అర్హులకే పథకాలు అందజేయాలి'



కల్హేర్ మండలం రాపర్తిలో నాలుగు పథకాల మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలను అందించాలని పలువురు పేర్కొన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లాలో వట్పల్లిలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రతాప్‌జ్యోషి, మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, నారాయణఖేడ్ మండల పరిధి జూక్కల్‌లో ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, కల్హేర్ మండలం రాపర్తిలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జిన్నారం మండలం మాదారం, హత్నూర మండలం ముచ్చర్లలో, కంగ్టి మండలం గాంధీనగర్‌లో మండల ప్రత్యేక అధికారి నూతన్‌కుమార్, ఎంపీడీవో సత్తయ్య, ఎమ్మార్వో అబ్దుల్ నజీంఖాన్, కోహీర్ మండలం రాజనెలిలో, జహీరాబాద్ మండలం చిరాగ్‌పల్లిలో, రాయికోడ్ మండలం నాగ్వార్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, ఝరాసంగం మండలం బర్దీపూర్‌లో ట్రైనీ కలెక్టర్ మనోజ్, సంగారెడ్డి మండలం ఇరిగిపల్లిలో ఎంపీడీవో యాదగిరిరెడ్డి, మునిపల్లి మండలం ఇబ్రహీంపూర్‌లో రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి పత్రాలు అందజేశారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం పొడ్చన్‌పల్లిలో కలెక్టర్ రాహుల్‌రాజ్, మెదక్ మండలం బాలనగర్ గ్రామపంచాయతీలో పథకాల ప్రొసీడింగ్‌లను అందజేశారు.

- న్యూస్ నెట్‌వర్క్



మెదక్ కల్చరల్ : లబ్దిదారులకు పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

సంక్షేమ పథకాల పంపిణీలో ప్రొటోకాల్ రగడ

కొడిపల్లి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలనలో భాగంగా 4 సంక్షేమ పథకాల పంపిణీకి మండలంలోని వెంకటాపూర్(ఆర్) గ్రామాన్ని అధికారులు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పంపిణీ పత్రాలను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అందజేసింది. ఇంతలో ఆలస్యంగా వచ్చిన ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రొటోకాల్ ప్రకారం.. ఆమెకు అర్హత ఉన్నదా.. అని అధికారులను ప్రశ్నించారు. అర్హత ఉన్నదని సమాధానం చెప్పడంతో సునీతారెడ్డి సుహాసినిరెడ్డి నుంచి మైక్ లాక్కొని వెళ్లిపోయేందుకు సిద్ధమయ్యారు. అక్కడున్న బీఆర్ఎస్ నాయకులు తమకు ఎమ్మెల్యే చేత సంక్షేమ పథకాలు పంపిణీ చేయాలన్నారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు ఇరువర్గాలకు నచ్చజెప్పారు.

ఖాజీపేటలో వాగ్వివాదం

నర్సాపూర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న నాలుగు పథకాల్లో భాగంగా ఆదివారం నర్సాపూర్ మండలం కాజీపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని లబ్ధిదారులు మంజూరీ పత్రాలను అందజేశారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ కె.శ్రీనివాస్, ఎంపీడీవో మధులత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతుండగా.. ఆంజనేయులుగౌడ్ కలుగచేసుకుని ప్రసంగాన్ని అడ్డుకుని వాగ్వివాదానికి దిగారు. అధికారిక కార్యక్రమంలో పాల్గొని రాజకీయాలు మాట్లాడడమే కాకుండా.. సీఎం పేరు ప్రస్తావించకపోవడం తగదని ప్రశ్నించారు. దీంతో ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడి మధ్య కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. ఎస్ఐ లింగం తన సిబ్బందితో అక్కడికి చేరుకుని ఇరువర్గాల కార్యకర్తలను బయటకు పంపించారు.



వెంకటాపూర్(ఆర్)లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి నుంచి మైక్ లాక్కుంటున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

ఘనంగా గణతంత్ర వేడుకలు



చిట్కుల్‌లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్

పటాన్‌చెరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లో 76వ గణంతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద జాతయ పతాకాన్ని ఆవిష్కరించారు. పతాకావిష్కరణలో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్ పాల్గొని మాట్లాడారు. ఇటీవల సంక్షేమ పథకాలకు ఎంపికైన లబ్దీదారులు టపాకాయలు కాల్చి, స్వీట్లను పంపిణీ చేశారు.

జెండా ఎగురవేసిన పులిమామిడి రాజు



సదాశివపేట పట్టణంలోని 12వ వార్డులో జాతీయ జెండాను ఎగురవేస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పులిమామిడిరాజు

సదాశివపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఆదివారం సదాశివపేట పట్టణం, మండలంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కె.సరస్వతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పట్టణంలో 12వ వార్డులో ఉషాకిరణ్ అసోషియేషన్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, కౌన్సిలర్ పులిమామిడి రాజు జాతీయ జెండాను ఎగురవేశారు.

అర్హులందరికీ పథకాలు అందించాలి

- లేదంటే ఉద్యమిస్తాం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



ఎల్లారంలో ప్రజాపాలన సంక్షేమ పథకాల మంజూరు పత్రాలను లబ్దిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : అర్హులైప పేదలకు సంక్షేమ పథకాలను అందించాలని, లేనిపక్షంలో ఉద్యమిస్తామని సంగారెడ్డి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ అన్నారు. ఆదివారం సదాశివపేట మండలం ఎల్లారం గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలనలో ఆయన పాల్గొని ప్రజాపాలన 4 సంక్షేమ పథకాల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలో రైతులకు రుణమాఫీ చెక్కులను విడుదల చేస్తే రైతుల ఖాతాల్లో ఎందుకు రుణమాఫీ డబ్బులు ఎందుకు జమ చేయలేదని అధికారులను నిలదీశారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ జరిగేలా చూడాలని ఆదేశించారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, పథకాల కోసం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ఉపాధిహామీలో జాబ్ కార్డు ఉన్న వారందరికీ వర్తించేలా ప్రభుత్వం పునరాలోచించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణగుప్తా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చాట్ల సిద్ధన్న, ఎంపీడీవో కే.లక్ష్మి, తహసీల్దా కే.సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- పీఏసీఎస్ చైర్మన్ పద్మ దుర్గయ్య

మునిపల్లి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే కందులను విక్రయించాలని పెద్దచెల్మెడ పీఏసీఎస్ చైర్మన్ పద్మ దుర్గయ్య, వైస్ చైర్మన్ సరోజినీదేవిమధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పెద్దచెల్మెడ సహకార సొసైటీ బ్యాంకులో కందుల కొనుగోలు కేంద్రాన్ని అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల కొనుగోలు కేంద్రంలో విక్రయించి క్వింటాల్‌కు రూ.7,550 మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ సంజీవరెడ్డి, సంగన్న, మొగులమ్మ, కార్యదర్శి శివకుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహిద్దాం

జహీరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : చిరుధాన్యాల సాగును మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నదని కేవీకే శాస్త్రవేత్త రమేష్, డీడీఎస్ మహిళా రైతులు కమిలిబాయి, సోనిబాయి, రుక్మిబాయి, జార్జీబాయి పేర్కొన్నారు. ఆదివారం మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లి తండాలో పాతపంటల జాతరను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరుధాన్యాల్లో పోసకాలు అధికంగా ఉన్నందున, మనం తీసుకునే ఆహారంలో ప్రతిరోజూ చిరుధాన్యాల పంటలు ఉండాలన్నారు. ఇందులో భాగంగా తండాలో చిరుధాన్యాలతో అలంకరించిన ఎడ్లబండ్లను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో జాతర నిర్వాహకులు పాల్గొన్నారు.

'క్రీడలతో మానసిక ప్రశాంతత'

నర్సాపూర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ప్రశాంతతో పాటు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో నర్సాపూర్ జూనియర్ కాలేజీ మైదానంలో ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీలను మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గం నాయకులు, ఉమ్మడి జిల్లా నుండి వచ్చిన పలు టీంలు పాల్గొన్నాయి.

'మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు సముచితం కాదు'

చిలప్‌చెడ్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు సముచితం కాదని బీజేపీ మండల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిన్న సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీలో భాగంగా మాట్లాడిన ఆవుల రాజిరెడ్డి తన పని తాను చేయకుండా కేంద్ర మంత్రిపై నోటికి ఎంతవస్తే అంత మాట్లాడడం సబబు కాదన్నారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లను అడిగినప్పుడు కేంద్ర మంత్రులు బాగున్నారు, ఇప్పుడు విమర్శిస్తున్నారని మండిపడ్డారు.

యశ్వంత్‌కు రాష్ట్రస్థాయి ఇన్నోవేటర్ అవార్డు

మెదక్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : వృథా నీటిని మంచినీరుగా మార్చే ఆటోమేటిక్ ఇన్నోవేటర్‌ను తయారుచేసి ప్రదర్శించిన విద్యార్థికి ఇన్నోవేటర్ అవార్డు వరించింది. నాగ్సాన్‌పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి పోలబోయిన యశ్వంత్ ఇటీవల పాఠశాలలో వృథా నీటితో ఆటోమెటిక్‌గా యూరినల్స్ క్లీనింగ్ మిషన్‌ను తయారుచేసి ఉపాధ్యాయుల సహకారంతో రాష్ట్రస్థాయిలో ప్రదర్శించారు. ఇందుకుగాను ఎంపిక యశ్వంత్ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. దీంతో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా నాగ్సాన్‌పల్లి పంచాయతీ కార్యదర్శి దుర్గాభవాని చేతుల మీదుగా విలేజ్ ఇన్నోవేటర్ అవార్డును అందుకున్నాడు.